క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకురాలు

నెల్లిమర్ల: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్, వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ రమామోహిని తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను శనివారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈనెల 18న నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో కె. అమూల్య, బి. లలిత హ్యాండ్‌బాల్ పోటీల్లో.. బి. అను వాలీ బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపియ్యారన్నారు. స్కూల్‌గేమ్స్ అండర్–19 విభాగంలో వీరు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ కామేశ్వరి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

172 షాపులకు మద్యం సరఫరా



మాట్లాడుతున్న డిపో మేనేజర్ గౌరీశ్వరరావు

నెల్లిమర్ల: మండల కేంద్రంలో గల ఐఎంఎల్ డిపోకు సంబంధించి 177 షాపులకు గాను 172 షాపులకు ఈ నెల 15 నుంచి శనివారం వరకు 42,257 మద్యం కేసుల సరఫరా చేసినట్లు డిపో మేనేజర్ ఆర్. గౌరీశ్వరరావు తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఇంకా ఐదు షాపులకు మద్యం సరఫరా చేయాలన్నారు. 177 షాపుల్లో 136 షాపులు విజయనగరం జిల్లాలో, 41షాపులు పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్నాయన్నారు. రూ.99 మద్యం బాటిళ్లు ఇంకా రాలేదని స్పష్టం చేశారు. త్వరలో వస్తాయని తెలిపారు.

ఎల్‌పీజీ దహన వాటిక ఏర్పాటు



ఎల్‌పీజీ దహన వాటికతో రోటరీ ప్రతినిధులు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గల తోటపాలెంలోని రోటరీ శ్మశానవాటికలో ఎల్‌పీజీ దహనవాటికను శనివారం ఏర్పాటు చేశారు. కోల్ ఇండియా వారి సీఎస్సార్ ప్రాజెక్ట్‌లో భాగంగా రోటరీ జిల్లాల పరిధిలో ఈ సిస్టమ్ ఏర్పాటు చేయడం జరిగిందని రోటరీ సెంట్రల్ క్లబ్ కార్యదర్శి శంకర్ రెడ్డి తెలిపారు. కేరళ నుంచి వచ్చిన ఫాయద్ బృందం ఈ సిస్టమ్‌ను అమర్చారన్నారు. ఈ యంత్రం ఖరీదు 15 లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు. ఎల్‌పీజీ సహాయంతో పనిచేసే గ్యాస్ బర్నర్ ఇందులో ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో టీఎల్ఎన్ మూర్తి, రోటరీ గవర్నర్ డాక్టర్ ఎం. వేంకటేశ్వరరావు, పూర్వ గవర్నర్లు మడిపల్లి రామారావు, జయకృష్ణ, పూర్వ చైర్మన్ ఎ. శివకుమార్, క్లబ్ మెంబర్స్ పాల్గొన్నారు.

పైడితల్లిని దర్శించుకున్న ఎచ్చెర్ల ఎమ్మెల్యే

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లిని ఎచ్చెర్ల ఎమ్మెల్యే, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నడుకుదిటి ఈశ్వరరావు శనివారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం వేదపండితులు పూర్ణకుంభంతో ఆయనకు స్వాగతం పలికారు.

మృతుడి కుటుంబానికి వితరణ



బాధిత కుటుంబానికి చెక్ అందజేస్తున్న కార్మిక సంఘ నాయకుడు అప్పలరాజు, తదితరులు

పూసపాటిరేగ: ప్రమాదవశాత్తూ చెరువులో జారిపడి మృతి చెందిన మ్యాట్రిక్స్ పరిశ్రమ కార్మికుడు కుటుంబానికి తోటి కార్మికులు ఆర్థిక సాయం చేశారు. పరిశ్రమలో పనిచేస్తూ ఇటీవల చెరువులో జారిపడి మృతి చెందిన బమ్మిడి కనకరాజు కుటుంబానికి కార్మిక సంఘ నాయికుడు నల్ల అప్పలరాజు చేతుల మీదుగా 2.45 లక్షలు రుపాయల చెక్ శనివారం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ధోని, వైస్ ప్రెసిడెంట్ కోట్ల శ్రీను, యూనియన్ నాయకులు కృష్ణంనాయుడు, జి.అప్పన్న, రాజేష్, రామారావు, శ్రీను, సాయి, అప్పలనర్సి, రాము, ఆవాల రమణ, తదితరులు పాల్గొన్నారు.

- నగరంలో ఉన్న భవనాలు 60 వేలు
- పథకానికి వచ్చిన దరఖాస్తులు 122
- ఇందులో యూనిట్ ఏర్పాటు చేసిన ఇళ్లు 80
- దరఖాస్తు చేసుకుంటే అనుమతులిస్తామంటున్న అధికారులు



నగరంలోని ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్ ప్యానల్స్

పీఎం సూర్యఘర్ పథకానికి.. ఆదరణ అంతంతే...!

విజయనగరం: సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సామాన్యులకు విద్యుత్ బిల్లుల భారం నుంచి ఉపశమనం కల్పించే దిశగా చర్యలు చేపడుతోంది. ఈక్రమంలో ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో భాగంగా ఇంటి పైకప్పుపై నుంచే విద్యుత్ ఉత్పత్తి చేసి నిల్వ చేసుకునే అవకాశం కల్పిస్తోంది. అయితే ఈ పథకం వల్ల కలిగే ప్రయోజనాలపై ఆ శాఖ అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఆశించిన స్థాయిలో ఫలితాలు ఇవ్వడం లేదు. సౌర విద్యుత్‌ను ప్రతి ఇంటికి చేరువ చేయాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'పీఎం సూర్యఘర్ ఉచిత విద్యుత్ పథకానికి విజయనగరం జిల్లా కేంద్రంలో వచ్చిన దరఖాస్తులే ఇందుకు తార్కాణంగా నిలుస్తున్నాయి. పథకం ద్వారా సౌర పలకల యూనిట్‌ను ఏర్పాటు చేసుకుని కరెంట్ నిల్వ చేసుకునే అవకాశం ఉంది. అవసరం మేరకు వినియోగించుకుని మిగిలిన యూనిట్లను విక్రయించుకోవచ్చు. దీనికి కేంద్ర ప్రభుత్వమే రాయితీ అందించి, బ్యాంక్ రుణాలను సైతం ఇప్పించి ఇంటిపై యూనిట్ ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకుంటోంది.

కార్పొరేషన్ పరిధిలో వచ్చిన దరఖాస్తులు 122.

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ అధికారిక లెక్కల ప్రకారం నగరంలో సుమారు ఆరు వేలకు పైగా భవనాలు ఉన్నాయి. అయితే విద్యుత్ శాఖ అధికారులకు ఇప్పటివరకు 122 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 80 మందికి అనుమతులిచ్చి సోలార్ ప్యానెల్స్ బిగించినట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. వాస్తవానికి విద్యుత్ శాఖ అధికారులు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో పక్షం రోజుల కిందట అవగాహన కార్యక్రమం నిర్వహించినప్పటికీ దరఖాస్తులు ఆశించిన స్థాయిలో రాకపోవడం గమనార్హం. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం ద్వారా పథకం అమలులో ప్రగతి సాధ్యపడుతుందన్న భావన వ్యక్తమవుతోంది.

గరిష్టంగా రూ.78 వేల రాయితీ

పీఎం సూర్యఘర్ పథకం ద్వారా దేశవ్యాప్తంగా కోటి గృహాలకు సౌర విద్యుత్ ఏర్పాటుకు రాయితీ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో ఇంటిపై గరిష్ఠంగా 3 కిలోవాట్ల యూనిట్‌కు రూ.78 వేల చొప్పున రాయితీ ఇస్తోంది. అందులో కిలో వాట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు కిలో వాట్లకు రూ.78 వేల చొప్పున రాయితీ అందిస్తోంది. మూడు కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు రూ.1.45 లక్షలు ఖర్చవుతుంది. అందులో కేంద్రం గరిష్ఠంగా రూ.78 వేలు భరిస్తుంది. మిగిలిన మొత్తాన్ని పూచీకత్తు లేకుండా తక్కువ వడ్డీకే బ్యాంక్‌ల ద్వారా రుణాలు ఇప్పిస్తుంది.

అవగాహన కల్పిస్తున్నాం..

కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకానికి విరివిగా రాయితీ రుణాలు అందిస్తోంది. ఇప్పటి వరకు 80 కనెక్షన్లకు అనుమతులు ఇచ్చాం. మరో 42 దరఖాస్తులకు అనుమతులు జారీ చేసే పనిలో ఉన్నాం. ఏర్పాటు చేస్తున్న అన్నింటికీ కేంద్రం రాయితీ వస్తుంది. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఈ పథకాన్ని అమలు చేస్తాం. 10 వేల దరఖాస్తులు వచ్చినా అనుమతులిచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. సందేహాలుంటే ఏఈలను సంప్రదిస్తే నివృత్తి చేస్తారు.

– కిరణ్‌కుమార్, ఏడీఈ, విజయనగరం టౌన్

రక్తదానానికి ముందుకు రావాలి

- ఎంపీపీ మామిడి అప్పలనాయుడు



రక్తదాతను సత్కరిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు, తదితరులు

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని.. ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక విజయ బ్లడ్‌బ్యాంక్‌లో గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చన్నారు. రక్తదాన ఉద్యమాన్ని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. బి.సుభాష్ 55వ సారి రక్తదానం చేయడంతో పలువురు ఆయన్ను అభినందించారు. కార్యక్రమంలో దయానంద్, అబ్దుల్ రవూఫ్, పెద్దాడ హరీష్, పి.శివ, తదితరులు పాల్గొన్నారు.

దేవాంగ సంఘ భవనం ప్రారంభం రేపు



దేవాంగ సంఘ నూతన భవనం ప్రారంభోత్సవ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

విజయనగరం: నగరంలోని పుచ్చలవీధిలో నిర్మించిన దేవాంగ సంఘ భవనాన్ని సోమవారం ప్రారంభించనున్నట్లు సంఘ జిల్లా అధ్యక్షుడు ఉప్పు ప్రకాశరావు తెలిపారు. ఈ మేరకు పుచ్చలవీధిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రారంభోత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ.. భవనం ప్రారంభోత్సవానికి తిరుపతి దేవాంగ సత్రం అధ్యక్షుడు బొమ్మన దుర్గాప్రసాదరావు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో దేవాంగ సామాజికవర్గానికి చెందిన వారంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కె. లక్ష్మీనరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేటకు చేరుకున్న సిరిమాను



సిరిమానును హుకుంపేటకు తీసుకెళ్తున్న పైడితల్లి దీక్షాపరులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి సిరిమానోత్సవం ఈ నెల 15న అంగరంగ వైభవంగా జరిగింది. నాటి నుంచి సిరిమానును భక్తుల సందర్శనార్థం ఆలయం వద్దే అధికారులు ఉంచారు. ప్రతి ఏటా మాదిరిగానే పండుగ పూర్తయిన తొలి శనివారం వేకువజామున సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, పైడితల్లి దీక్షాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో, గురుస్వామి సత్తి అచ్చిరెడ్డి సారథ్యంలో వందలాది మంది దీక్షాపరులతో సిరిమానును చదురుగుడి నుంచి హుకుంపేటకు తరలించారు. హుకుంపేటలోని రాజ్‌గోపాల్ టాండ్రీలో సిరిమానును భద్రపరిచారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో పైడితల్లి దీక్షాపరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే పల్లె ప్రగతి

- ఎంపీపీ మామిడి



ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న ఎంపీపీ మామిడి

విజయనగరం రూరల్: పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులందరూ సమష్టిగా పనిచేస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని తన చాంబర్‌లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలానికి ఎన్ఆర్ఈజీఎస్ ఫండ్స్ రూ.9 కోట్ల 88 లక్షలు మంజూరయ్యిందన్నారు. ఈ నిధులతో మండలంలోని అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టాలని పిలుపునిచ్చారు. పనులకు సంబంధించి త్వరలోనే టెండర్లు పిలవడం జరుగుతుందన్నారు.

ఆస్తుల పరిరక్షణకు కృషి..

విజయనగరం టౌన్: సీబీసీఎన్‌సీ ఆస్తుల పరిరక్షణకు కృషి చేస్తానని బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన భరోసా ఇచ్చారని సీబీసీఎన్‌సీ ఆస్తుల పరిరక్షణ కమిటీ చైర్మన్, సంఘమిత్ర ఆర్ఎస్.జాన్ తెలిపారు. ఈ మేరకు బొబ్బిలి ఎమ్మెల్యేను కోటలో మర్యాద పూర్వకంగా శనివారం కలిశారు. ఆస్తుల పరిరక్షణకు సహకరిస్తానన్న ఎమ్మెల్యేను సత్కరించారు. అనంతరం ఆర్ఎస్ జాన్ మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా సీబీసీఎన్‌సీ ఆస్తులను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సీబీసీఎన్‌సి ఎడ్యుకేషన్ కన్వీనర్ ఎంఎ నాయుడు, లీగల్ అడ్వైజర్ ఆదాడ మోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



భగవతీ నృత్యకళామందిర్ చిన్నారులను అభినందిస్తున్న సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, ఆర్.సూర్యపాత్రో, తదితరులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా స్థానిక మూడులాంతర్లు వద్దనున్న చదురుగుడి, రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంటున్నాయి. చదురుగుడి ఆవరణలో భగవతి నృత్యకళామందిర్ చిన్నారులు చేసిన నృత్యప్రదర్శనలు ఆద్యంతం చూపరులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, పైడితల్లి దీక్షాపీఠం వ్యవస్థాపకుడు ఆర్.సూర్యపాత్రో, ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావులు చిన్నారులను ఆశీర్వదించారు. అనంతరం డప్పు శ్రీను జానపద గీతాలు ఆలపించారు. స్థానిక రైల్వే స్టేషన్ వద్దనున్న వనంగుడి ఆవరణలో కె.కుసుమ సంగీత కచేరీ, రెడ్డి తిరుపతిరావు, కె.వాసునాయుడు ఏకపాత్రాభినయాలు అలరించాయి. కళాకారులను ఈఓ ప్రసాదరావు ఘనంగా సత్కరించారు.

మునగాకుతో రక్తహీనతకు చెక్

విజయనగరం ఫోర్ట్: మునగాకు తినడం వల్ల రక్తహీనత ఉండదని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి. అనురాధ అన్నారు. వీటీ అగ్రహారం అంగన్‌వాడీ కేంద్రంలో మునగాకు ప్రయోజనాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మునగాకు తినడం వల్ల కీళ్ల నొప్పులు తగ్గుతాయని తెలిపారు. హిమోగ్లోబిన్ పెరగడంతో పాటు కంటికి బాగా పని చేస్తుందన్నారు.

బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చర్యలు



విలేకర్లతో మాట్లాడుతున్న సీఐ వెంకటరావు

నెల్లిమర్ల: నెల్లిమర్ల, గుర్ల మండలాలతో పాటు నెల్లిమర్ల నగర పంచాయతీల పరిధిలో ఎవరైనా అక్రమంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ ఎం. వెంకటరావు హెచ్చరించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. తన స్టేషన్ పరిధిలో 10 మద్యం షాపులు మంజూరయ్యాయన్నారు. నెల్లిమర్ల నగర పంచాయతీలో నాలుగు, నెల్లిమర్ల మండలంలోని సతివాడ, కొండవెలగాడలో ఒక్కొక్కటి, గుర్ల మండలంలో గుర్లలో రెండు, అచ్యుతాపురంలో ఒకటి, కోటగండ్రేడులో ఒకటి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటిలో గుర్లలో మినహా అన్ని చోట్ల మద్యం అమ్మకాలు ప్రారంభమైనట్లు తెలిపారు. అలాగే ఈ షాపులు ఈనెల 22 వరకు ప్రొవిజినల్ లైసెన్స్‌తో నడుస్తాయని తెలిపారు. ఈనెల 22వ తేదీ తర్వాత ప్రభుత్వం లైసెన్స్‌లు మంజూరు చేస్తుందన్నారు.

డయేరియాను అదుపులోకి తీసుకురావాలి

విజయనగరం అర్బన్: గుర్ల మండలంలో ప్రబలిన డయేరియాను అదుపులోకి తీసుకురావాలని ప్రజారోగ్య వేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు వేదిక కన్వీనర్ ఎస్. లక్ష్మణరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. డయేరియాతో ఎనిమిది మంది మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. గుర్లలో పారిశుధ్య పనులు నిర్వహించడంతో పాటు సురక్షిత నీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సొంత భవనం కేటాయించాలి

విజయనగరం పూల్‌బాగ్: విజయనగరం పట్టణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి. రాము, సీహెచ్ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సొంత భవనం మంజూరు చేయాలని కోరుతూ శనివారం సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో ఎర్రమ్మ, రాహుల్, సూరిబాబు, మురళి, తదితరులు పాల్గొన్నారు.

జానపద కళలను కాపాడుకుందాం



తోలుబొమ్మలాట కళాకారులను సత్కరిస్తున్న బద్రి కూర్మారావు, తదితరులు

విజయనగరం టౌన్: అతి ప్రాచీన కళారూపాలైన తోలుబొమ్మలాట, జముకుల పాట, తూర్పు భాగవతం వంటి కళలను కాపాడుకోవాలని గిడుగు రామ్మూర్తి తెలుగు భాష, జానపద కళాపీఠం వ్యవస్థాపకుడు బద్రి కూర్మారావు పలుపునిచ్చారు. పైడితల్లి జాతర పురస్కరించుకుని స్థానిక వనంగుడి వద్ద తోలుబొమ్మలాట కళాకారులను శనివారం ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సినిమా, టీవీల్లేని రోజుల్లో పల్లె ప్రజలకు రామాయణం, మహాభారతం వంటి గాథలు వినిపించిన ఈ కళారూపం ప్రస్తుతం చివరి దశలో ఉందన్నారు. కళాకారుడు తోట పవన్ కుమార్ మాట్లాడుతూ.. పైడితల్లి జాతరలో ఈ కళను ప్రదర్శిస్తున్నామని, ప్రభుత్వాలు తోలుబొమ్మలాట కళాకారులకు పింఛన్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఇస్కఫ్ కార్యదర్శి షేక్ గౌస్‌బాషా, కుమ్మరి మాస్టర్ బృందం, సీనియర్ తబలా కళాకారుడు పైడిరాజు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

- ఎస్సై గణేష్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై గణేష్

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎస్సై బి. గణేష్ సూచించారు. మండలంలోని సతివాడ ఉన్నత పాఠశాలలో చట్టాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని, లక్ష్య సాధనకు కృషి చేయాలని సూచించారు. ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని.. చెడు అలవాట్లకు బానిసలైతే జీవితం నాశనమవుతుందని చెప్పారు. మైనర్లు వాహనాలు నడపడం నేరమని, నిర్ణీత వయస్సు వచ్చినంత వరకు వాహనాలు నడపవద్దని సూచించారు. బాల్య వివాహాల వల్ల ఎన్నో అనర్థాలు చోటుచేసుకుంటాయని, ఈ విషయంలో తల్లిదండ్రులకు విద్యార్థులే అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే లోకం నాగమాధవి



పూసపాటిరేగ: రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసి శిలాఫలకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి, తదితరులు

పూసపాటిరేగ : గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నామని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని పూసపాటిరేగ, సీహెచ్ అగ్రహారం, చల్లవాని తోట, రెల్లివలస గ్రామాలలో శనివారం పల్లెపండుగ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమిపూజ చేపట్టి, శిలాఫలకాలను ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, ఉపాధి హామీ నిధులతో గ్రామల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఆమెతో పాటు ఎంపీడీఓ ఎం. రాధిక, ఏపీఓ రత్నమాల, మండల ఇంజినీరింగ్ అధికారి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు మహంతి శివ, కిలారి సూరిబాబు, బాలా అప్పలరాజు, గుడివాడ జమరాజు, కొత్తకోట శ్రీరాములు, పతివాడ శ్రీనివాసరావు, పతివాడ వరలక్ష్మి, ఇజ్జరోతు ఈశ్వరరావు, ఇజ్జరోతు అప్పలరాజు, గుడివాడ శేఖర్, పిసిని నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాకోడులో..



విజయనగరం రూరల్: రాకోడులో పల్లెపండుగ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అదితిగజపతిరాజు

విజయనగరం రూరల్: మండలంలోని రాకోడులో పల్లెపండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతి మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారన్నారు. ఇందుకోసం మండలానికి రూ. పది కోట్ల కాంపొనెంట్ నిధులు మంజూరు చేశారని చెప్పారు. ఈ నిధులతో ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువలతో పాటు పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశ్నార్థకంగా 'క్యాంపస్ చాలెంజ్' మనుగడ

- సిటిజన్ ఫోర్స్ ఫౌండేషన్ సీఎండీ రమేష్‌బాబు



మాట్లాడుతున్న సిటిజెన్ ఫోర్స్ ఫౌండేషన్ సీఎండీ రమేష్‌బాబు

విజయనగరం: అభాగ్యులైన చిన్నారుల కోసం నిర్వహించబడుతున్న ఓ సేవా సంస్థ మనుగడ ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారిందని సిటిజన్ ఫోర్స్ ఫౌండేషన్ సీఎండీ పి. రమేష్‌బాబు ఆందోళన వ్యక్తం చేశారు. నగరంలోని ఓ హోటల్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని పూసపాటిరేగ మండలం కోనాడ జంక్షన్ సమీపంలో కొత్త కొప్పెర్ల గ్రామ పరిధిలోని ఓ సేవా సంస్థను అమాంతం మింగేసేందుకు కొందరు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ప్రస్తుతం క్యాంపస్ చాలెంజ్ పేరుతో నిర్వహించబడుతున్న సేవా సంస్థకు దాదాపు ఐదెకరాల భూమి, అందులో పలు భవనాలు.. వెరసి, సుమారు 35 కోట్ల రూపాయల విలువైన ఆస్తులున్నాయని వివరించారు. సదరు ఆస్తులపై కన్నేసిన మూడు సంస్థలు.. సొసైటీలో ఆశ్రయం పొందుతున్న చిన్నారుల భవిష్యత్‌ను చిదిమేస్తున్నాయని.. పారదర్శకమైన న్యాయ విచారణ ద్వారా చిన్నారుల భవిష్యత్తుకు భరోసా కల్పించాల్సి ఉందని అభిప్రాయపడ్డారు.